క్లుప్తంగా

బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న బసవన్న

మద్దికెర: స్థానిక బసవేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం బసవ జయంతి పురస్కరించుకొని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చనతో పాటు పుష్పాభిషేకం, మహామంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, సహకారసంఘం అధ్యక్షుడు శాంతన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు తాలూరి వెంకటేశ్వరరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, దశివర్ధన్‌రెడ్డి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందవరం: వేసవి దృష్ట్యా గ్రామంలో నీటి సమస్యకు నివారణకు చర్యలు చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉప సర్పంచ్ శివారెడ్డిగౌడ పేర్కొన్నారు. ఆయన ఆదివారం నందవరంలోని పైగేరి, కింది గేరి వాసులతో నీటి సమస్యపై మాట్లాడారు. వేసవి దృష్ట్యా గ్రామంలో నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి వీధి వీధికి ఒక వాల్వ్ ఏర్పాటు చేస్తామని వివరించారు. వీధి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని, వృథా చేయరాదని కాలనీ వాసులకు సూచించారు. ప్రతి వీధి మెయిన్ లైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేస్తామని, తద్వారా నీటి ఎద్దడికి తావుండదని పేర్కొన్నారు. బోర్లు, తిమ్మారెడ్డి కుంట ద్వారా ఓహెచ్ఆర్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసి, అక్కడి నుంచి ప్రతి వీధికి నీటిని సరఫరా చేస్తామన్నారు. వార్డు సభ్యులు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రమేశప్ప గౌడ, ఎల్లాగౌడ, భీమశేఖర్‌లు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిద్దాం

మద్దికెర: క్రీడాకారులు ఉన్నతంగా ఎదిగేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, పోచిమిరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్ ప్రాక్టీస్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటగాళ్లు దేశవాళీ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వారికి కావాల్సిన ఏర్పాట్లు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం దాతను యువకులు శాలువా కప్పి సన్మానించారు.

నేడు తొగర్చేడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామ పంచాయతీలో సోమ, మంగళవారాల్లో ఉదయం 7 గంటలకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని ఆయన కోరారు.

27న టూరిజం వసతిగృహం వేలం


బ్రహ్మగుండంలోని టూరిజం వసతి గృహం భవనం

వెల్దుర్తి: బ్రహ్మగుండంలో దశాబ్దం క్రితం నిర్మితమై నిరుపయోగంగా ఉన్న టూరిజం వసతిగృహ భవనాన్ని పదేళ్ల కాలపరిమితితో లీజుకు ఇచ్చేందుకు ఈనెల 27న వేలంపాట నిర్వహించనున్నట్లు జిల్లా టూరిజం అథారిటీ అధికారి విజయ ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చారు. వేలంలో పాల్గొనదలచిన వారు జిల్లా కలెక్టర్ అండ్ చైర్మన్ జిల్లా టూరిజం కౌన్సిల్, కర్నూలు పేరిట రూ.10 వేలు డీడీ తీసి వేలం పాటకు ఒకరోజు ముందు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయం పక్కన గల ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో వేలం పాట ఉంటుందని, వివరాలకు 63099 24034 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం


సోమయ్యను గుర్తించిన మంత్రాలయం పోలీసులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు మంత్రాలయం వచ్చిన గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సోమయ్య అనే వ్యక్తి గత నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన విషయం తెలిసిందే. అయితే కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేసిన పోలీసులు ఆదివారం ఆదోని సమీపంలోని బైచిగేరి క్రాస్ వద్ద సోమయ్యను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమయ్యను వెతకడంలో కానిస్టేబుల్ రంగస్వామి కృషిని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు అభినందించారు.


హొళగుందలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


స్వామివారికి పూజలు చేస్తున్న రుద్రగౌడ్, ఎర్రకోట జగన్


ఆలూరులో బసవేశ్వరుడిని ఊరేగిస్తున్న భక్తులు


ఆలూరు వీరభద్రుడి వేషధారణలో కళాకారుడు

ఘనంగా బసవేశ్వర జయంతి


పత్తికొండలో పూజలందుకుంటున్న బసవేశ్వరుడు


నందవరంలో కలశాలతో రథోత్సవంలో పాల్గొన్న మహిళలు, భక్తులు


హొళగుందలో వృషభాలను ఊరేగిస్తున్న భక్తులు

నందవరం: వీరశైవ లింగాయతీల మూలపురుషుడు, పూలచింత, నందవరం గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం శ్రీ బండే బసవేశ్వరుడి రథోత్సవం ఆదివారం సాయంత్రం అశేష భక్త జనవాహిని మధ్య అత్యంత వైభవంగా సాగింది. బసవ జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు పంపాతి గౌడ్, బసవరాజు గౌడ్ ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు గావించి మహామంగళ హారతులు పట్టారు. భక్తులు స్వామి వారికి నారికేళాలు, పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ సేవలో డోలు, సన్నాయిల వాయిద్యాలు, నందికోల సేవ ఆకట్టుకున్నాయి. మహిళలు కలశాలతో ఊరేగింపుగా సాగారు. గ్రామ రైతులు వృషభాలకు ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6:45 నిమిషాలకు స్వామి వారిని మహారథంపై ఉంచి నంది కోలు సేవ, భక్తుల జయ జయ ధ్వానాల మధ్య వీధి చివరి వరకు లాగి నందిశ్వరుడికి పూజలు నిర్వహించి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హొళగుంద: మండలంలో ఆదివారం బసవ జయంతి వేడుకలను వీరశైవ లింగాయత్, ఇతర వర్గాల వారు ఘనంగా జరుపుకున్నారు. బసవేశ్వర స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. కర్ణాటక సంప్రదాయాలను పుణికి పుచ్చుకున్న స్థానిక ప్రజలు బసవేశ్వరుడిగా కొలిచే ఎద్దులకు ప్రత్యేక అలంకరణ చేసి వీధుల్లో ఊరేగించారు. వృషభాలకు పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఎల్లార్తిలో నందికోలు ఉత్సవం మధ్య బసవేశ్వరుడి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

పత్తికొండ రూరల్: స్థానిక పాతపేటలోని బసవేశ్వరాలయంలో బసవ జయంతిని ఆదివారం వీరశైవ లింగాయతీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బసవేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 1వ వార్డు కౌన్సిలర్ కామర్తినాగేశప్ప ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, ప్రధాన కార్యదర్శి బసరకోడు వీరేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, రుద్రగౌడ్, కౌన్సిలర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: వీరశైవ లింగాయతీ గురువు బసవేశ్వరుడి జయంతి ఉత్సవం ఆలూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోట వీధిలో కొలువుదీరిన భీమలింగేశ్వర స్వామి ఆలయం నుంచి ఎల్లార్తి రోడ్డు సమీపంలోని మర్రితాత మఠం వరకు మేళతాళాలతో ఊరేగించారు. వీరశైవ కులస్తులు, మహిళలు వంద కలశాలతో స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తాగునీటి సదుపాయం, అల్పాహారం ఏర్పాటు చేశారు. అలాగే హాలహర్వి మండలం మిదేహాళ్ గామంలో వీరశైవలింగాయతీ సంఘం నాయకుడు సూరిగౌడు, సర్పంచ్ ప్రహ్లాద్ తదితరుల ఆధ్వర్యంలో బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఎడ్లబండిపై గ్రామ చివరివరకు ఊరేగించారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్షలు


వెల్దుర్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలికల గురుకులం పరీక్ష కేంద్రం వద్ద కోలాహలం

వెల్దుర్తి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఆదివారం స్థానిక బాలికల గురుకులం కేంద్రంలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటల నుంచి 5వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించగా, కేటాయించిన 943 మంది విద్యార్థులలో 80 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్/ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసూన తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు 515 మందికి గాను 48 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్/అబ్జర్వర్‌గా ఓర్వకల్ జేఎల్ కృష్ణకుమారి వ్యవహరించారు. పిల్లలను పరీక్ష రాసేందుకు పంపిన తల్లిదండ్రులు తర్వాత ఎండకు ఆర్కే రహదారిలోని గురుకులం ముందు ఇబ్బందులు పడ్డారు. ఎండలు తాళలేక చెట్లు, పుట్టల నీడన, అవకాశమున్న ప్రతిచోట వందలాదిగా తలదాచుకున్నారు. రెండు పరీక్షలకు కలిపి 1,330 విద్యార్థులు హాజరుకాగా పరీక్షలు ముగిశాక రహదారిపై కొద్ది సమయం ట్రాఫిక్ స్తంభించింది. స్థానిక పోలీసులు పరీక్ష కేంద్రం బందోబస్తుతో పాటు ట్రాఫిక్ క్లియరెన్స్‌లో చొరవ చూపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు పరీక్ష కేంద్రం నిర్వాహకులు, పాఠశాల ప్రిన్సిపాల్ బృందం మంచి నీటితోపాటు మజ్జిగ పంపిణీ చేపట్టడం విశేషం.

136 మంది గైర్హాజరు

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు 136 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 882 మందికిగాను 838 మంది హాజరుకాగా, ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షకు 504 మందికిగాను 412 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్ష అనంతరం పత్రాలను ఏపీఆర్ సొసైటీకి పంపినట్లు ఆమె తెలిపారు.

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామ సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు 848 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించగా 735 మంది విద్యార్థులు హాజరుకాగా 113 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు 35 తరగతి గదులు, 36 మంది సిబ్బందిని నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని అబ్జర్వర్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. అలాగే ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్షకు 407 మంది దరఖాస్తు చేసుకోగా ఆదివారం నిర్వహించిన పరీక్షకు 333 మంది హాజరయ్యారు. 74 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్‌లు

మద్దికెర: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విలువైన వస్తువులు కాపాడుకునేందుకు మండలంలోని 4 ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆదివారం ఎంఈఓ రంగస్వామి తెలిపారు. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల కుటుంబసభ్యులు గానీ, పదవీ విరమణ పొందిన సైనికులు గానీ లేదా పేరెంట్స్ కమిటీల నిర్ణయం మేరకు భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. మండల పరిధిలోని కే.పేట గ్రామంలో బోయ నల్లబోతుల రాజ్‌కుమార్ ఇంటి వద్ద గుట్టుగా కర్ణాటక మద్యం అమ్ముతున్నాడు. సమాచారం అందడంతో ఎస్‌ఐ మహేష్‌కుమార్ పోలీసు సిబ్బందితో ఆదివారం తనిఖీ చేయించారు. నిందితుడి నుంచి 96 జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ డీలెక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

హొళగుంద: రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన దేవరగట్టులో ఆదివారం స్వామివారం పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయంలో పూజారులు మూలవిరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహా మంగళారతి, ఆకుపూజ, నివేదన, నిరాజన మొదలైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు పూజారులు తీర్థ ప్రసాదం అందజేయగా ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ముగిసిన ప్రవచనాలు

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 3 నుంచి ప్రారంభమైన శ్రీకలబుర్గి శరణ బసవేశ్వరస్వామి మహా పురాణ ప్రవచనం మంగళవారం ఘనంగా ముగిసింది. నెల రోజుల పాటు కల్బుర్గి శరణ బసవేశ్వరస్వామి జీవిత చరిత్రను ప్రవచనకారుడు రాష్ట్రీయ పురస్కారం పొందిన సిద్ధరామయ్య స్వామి హిరేమఠ శాస్త్రి భక్తులకు కథలు, గేయాలతో పాటు ఇతర పద్ధతిలో చెప్పి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రవచనకారుడు భక్తులనుద్దేశించి మాట్లాడారు. దాన ధర్మాలు, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం వల్ల పుణ్యం పొందుతారని, ఆ మార్గంలో నడవాలని భక్తులకు సూచించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, సిద్ధేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పత్తికొండ రూరల్: పత్తికొండ బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి నిలిపిఉంచిన లారీని బైక్‌పై వచ్చిన యువకులు గమనించకుండా వెనకవైపు ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కోడుమూరు మండల పరిధిలోని వల్కూరు గ్రామానికి చెందిన భాస్కర్ పెరవలిలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కృష్ణగిరికి చెందిన రంగడు లిఫ్టు అడగ్గా బైక్‌పై ఎక్కించుకున్నారు. రమ్య రిసార్ట్ సమీపంలో రిపేరీలో ఉన్న లారీని ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకుండా రోడ్డుపై నిలిపి ఉంచడంతో గుర్తించకుండా వెనకవైపు ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

వేధింపుల కేసు నమోదు

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మరో యువతిని మూడేళ్లుగా పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. అయితే గతేడాది నుంచి ఫోన్ ద్వారా వేధిస్తున్నాడని మాధవరం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

ఆపద్బాంధవ.. గోవింద


పూజలందుకుంటున్న భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరుడు

పత్తికొండ రూరల్: పత్తికొండలోని బ్రాహ్మణ వీధిలో కొలువైన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామివారు కొలిచిన వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతూ భక్తుల ఇలవేల్పుగా నిత్య పూజలందుకుంటున్నారు. సకల జనుల మధ్య ఏటా స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల 25వ తేదీన స్వామివారి రథోత్సవానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు.

ప్రారంభమైన పూజలు

స్వామివారి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలశస్థాపన పూజలు జరిపించారు. 24న సాయంత్రం గరుడోత్సవం, 25న ఉదయం 10.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం బ్రహ్మరథం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ఉంటుందని తెలిపారు. అలాగే 26న పారువేట, వసంతోత్సవం, 27న అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

నాలుగు స్తంభాల మండపం

పురాతన స్వామి దేవాలయానికి విశాలమైన ప్రాకారం ఉండేది. అభిముఖంగా దేవాలయ ప్రాకారంలోనే నేటి నాలుగు స్తంభాల మండపం ఉన్నట్లుగా పెద్దలు చెబుతారు. దేవాలయానికి, నాలుగు స్తంభాలకు మధ్యలో ఆనాడు బ్రిటీష్‌వారు ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించారు. దీంతో నాలుగు స్తంభాల మండపం ప్రధాన రోడ్డులోకి వెళ్లింది. ఈ కూడలి పత్తికొండలో అన్నింటికీ కేరాఫ్ అడ్రస్‌గా మిలిలిపోయింది. రథోత్సవం సందర్భంగా నేటికీ ఈ మండపంలోనే స్వామివారికి పవళింపు సేవ నిర్వహిస్తారు.

వైభవంగా మౌనేశ్వర స్వామి రథోత్సవం

ఆలూరు రూరల్ (హాలహర్వి): హాలహర్వి మండలంలోని నిట్రవట్టి గ్రామంలో వెలసిన శ్రీ మౌనేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. ఉదయం స్వామి వారికి గంగిపూజ, రుద్రాభిషేకం, శాంతి హోమం, పంచామృతాభిషేకం వంటి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 7.30 గంటలకు వేలాది మంది భక్తుల నడుమ రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనే ధ్యేయం


సంకల్ప దీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీఆర్‌పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే వీఆర్‌పీఎస్ లక్ష్యమని, ఈ మేరకు ఈనెల 31న ఢిల్లీలో వాల్మీకుల సంకల్ప దీక్ష పేరుతో పోరాటం చేయనున్నట్లు వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దూరు సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ కళాశాల ఆవరణలో సంకల్ప దీక్ష కరపత్రాలను ఆవిష్కరించి అనంతరం వాల్మీకి సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విషయంపై పార్లమెంట్‌లో ఆమోదం లభించే వరకు ఢిల్లీలో తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. వాల్మీకులు పార్టీలకతీతంగా పోరాటానికి కదలిరావాలని పిలుపునిచ్చారు. వీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌భీంనాయుడు, ఉపాధ్యక్షుడు మునెప్ప, నాయకులు కాశీంనాయుడు, మురళినాయుడు, లక్ష్మన్న, మద్దిలేటి, మహేంద్రబాబు, వెంకటేష్, రఘు, జయన్న, పెద్దయ్య, రామకృష్ణ, జయరాం, కేశన్న, నాగేష్, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి


లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగడంతో పాటు రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నారని సర్పంచ్ మల్లికార్జున, ఉప సర్పంచ్ ఆముదాల గోపాల్ అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి, మద్దికెరలోని పలు కాలనీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా రోడ్లు, పరిశ్రమలు, పోర్టు పనులు, వైద్య కళాశాలలు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అందిస్తూనే అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండల పరిధిలోని రోల్లపాడులో ఆదివారం సాయంత్రం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు నిర్వహించారు. రంగస్వామి, చిరంజీవి, నాగేశ్వరరావు, ఆనంద్, చిన్నరంగడు, మధు తదితరులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాలు అందుతున్నాయని చెప్పారు. వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యాన కేంద్ర బృందం

కోసిగి: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఆదోని, ఎమ్మిగనూరు పిరమిడ్ ధ్యాన కేంద్ర అధ్యక్షుడు పాండురంగ శెట్టి, వీరన్న శెట్టి పేర్కొన్నారు. ఆదివారం కోసిగిలో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో శాకాహారంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని, మానసిన ప్రశాంతత కలుగుతోందన్నారు. మానసిక ఒత్తిడికి గురై అనేక వ్యాధుల బారీ పడుతుంటామని, అధిగమించేందుకు ధ్యానం చేయడం మంచి మార్గమన్నారు. అలాగే మంసాహారం తినడం ఆరోగ్యానికి హాని కరమని, శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యులు రాఘవరెడ్డి, బన్నూరు నారాయణ, కంపాడు వీరన్న, వెంకటరమణ, మధుసూధన్ గుప్తా, ఎర్రిస్వామి, తిక్కయ్య, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

చలువ పందిళ్ల కిందనే వ్యాపారాలు


వెల్దుర్తి పాతబస్టాండులో ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన చలువ పందిళ్ల కింద తోపుడు బండ్ల వ్యాపారాలు

వెల్దుర్తి: మండుతున్న ఎండలకు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో పాతబస్టాండులో వారం రోజుల క్రితం చలివేంద్రంతోపాటు చలువ పందిరి ఏర్పాటు చేశారు. చలువ పందిరి కింద బస్సుల కొరకు వేచిచూసే ప్రయాణికులు, ఎండలు భరించలేని ప్రజలు సేదతీరడం జరుగుతోంది. అయితే ఈ చలువ పందిరి కింద బైక్‌లు పార్కింగ్ చేయడం, తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగించడంతో చలువ పందిరి లక్ష్యం కాస్తా నీరుకారుతోంది. చలివేంద్రంలో సైతం నీరు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు ఎదురవుతున్నాయి. పంచాయతీ అధికారులు, పాతబస్టాండు ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్‌ను పర్యవేక్షించే పోలీసులు బైక్ పార్కింగ్‌లు, వ్యాపారాలను కట్టడి చేసి ప్రయాణికులకు సౌకర్యం మెరుగుపడేలా, చలివేంద్రంలో నిత్యం నీరు అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఎల్లెల్సీ గట్టుపైనే చెత్త డంపింగ్


హొళగుంద సమీపంలో ఎల్లెల్సీ గట్టుపై చెత్తను డంప్ చేస్తున్న దృశ్యం

హొళగుంద: నిర్లక్ష్యమో, బద్ధకమో తెలియదు గానీ హొళగుందలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (చెత్త సేకరణ కేంద్రాలు) షెడ్‌లు ఉన్నా గ్రామంలో సేకరించిన చెత్తను తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) గట్టుపై పారబోస్తున్నారు. ఫలితంగా కాలువ గట్టు, పరిసరాలు డంపింగ్ యార్డును తలపిస్తోన్నాయి. చెత్త నీటిలో పడి కలుషితమై ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని గ్రామస్తులు వాపోతున్నారు. దీనికి తోడు చికెన్ వ్యర్థాలను వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. కొందరు ఏకంగా చనిపోయిన పంది, కుక్కలు ఇతర జంతువులు కళేబరాలను తెచ్చి కాలువ గట్టు పక్కనే వేస్తున్నారు. ఇటీవలే పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అక్కడ పారిశుద్ధ్య పనులు చేయించారు. అయినా కొందరు చెత్త, వ్యర్థాలను గట్టుపై వేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని వ్యర్థాలను చెత్త సేకరణ కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకుని ఎల్లెల్సీ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

ఆలూరు: కురుబ కులస్తులు ఐకమత్యంతో ఉన్నప్పుడే హక్కుల సాధనకు వీలుంటుందని రాష్ట్ర మాదాసి, మాదారి కురుబరిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కె.బి పెద్దయ్య అన్నారు. స్థానిక కురుబ సంఘం కార్యాలయంలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం పెద్దయ్య మాట్లాడారు. హక్కుల సాధనకు అందరూ కలసికట్టుగా ఉద్యమించాలన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, కారుమంచప్ప, లక్ష్మన్న, గిరి, ఉచ్చీరప్ప, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.